ప్రజాశక్తి

శుక్రవారం 3 నవంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

ఘాట్ రోడ్డులో నిలిచిన లారీ

- రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి ఘాట్ రోడ్డులో లారీ నిలిచి పోవడంతో రాకపోకలకు ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. గురువారం అరకు ప్రాంతం నుండి నీలగిరి కలప లోడుతో వెళ్తున్న లారీ మూడోవా నెంబర్ మలుపు వద్ద అడ్డంగా నిలిచి పోవడంతో ఆర్టిసి బస్సులతో పాటు ఇతర వాహనాలు తప్పించుకుని వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. గంటల తరబడి రాకపోకలకు అంతరాయం నెలకొంది.

రోడ్డుపై నిలిచిన లారీ

అరకులోయలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై సురేంద్ర తదితరులు

ప్రజా రక్షణ భేరి యాత్రకు..

జన నీరాజనం

- అరకు, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టుల్లో సభలు
- వందలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు
- అడవి బిడ్డలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అరకులోయ, అరకులోయ రూరల్, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు విలేకరులు

'అసమానతలు లేని అభివృద్ధి కోసం' సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు అల్లూరి జిల్లాలో అపూర్వ ఆదరణ దక్కుతోంది. గురువారం అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు మండలాల్లో ఈ యాత్రకు ఎక్కడికక్కడ ఘన స్వాగతం లభించింది. అరకులోయలోని ఎన్‌టిఆర్ గ్రౌండ్ నుంచి గిరిజన మ్యూజియం వరకు థింసా నృత్యాలు చేస్తూ యాత్రా బృందాన్ని స్వాగతించారు. యాత్ర రథసారథి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు, యాత్రా బృందం సభ్యులకు డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతం వద్ద గిరిజనులు తిలకందిద్ది, సంప్రదాయబద్ధంగా ఆహ్వానం పలికారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు నుంచి చేపట్టిన ర్యాలీతో ఆ ప్రాంతమంతా ఎర్రబారింది. సిపిఎం నేతల ప్రసంగాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా విన్నారు.

ఆదివాసీల జోలికొస్తే ఖబడ్దార్ : వి.శ్రీనివాసరావు

ఆదివాసీల జోలికొస్తే చూస్తూ ఊరుకునేది లేదని, వారికి ఎర్రజెండా తోడుగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆయన మండిపడ్డారు. ప్రజా రక్షణ భేరి యాత్రలో భాగంగా అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో చేపట్టిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలోని ఖనిజ సంపదలను దోచుకోవడానికే జాతీయ రహదారులను ఈ ప్రాంతంలో వేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ నరేంద్ర మోడీ, కార్పొరేట్ల పల్లకి మోస్తున్నారని విమర్శించారు. అరకు గడ్డపై గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఎందుకు నిర్మించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అందరితో సమానంగా చూస్తే గిరిజనులు ఎలా అభివృద్ధి చెందుతారని ఆయన ప్రశ్నించారు. వెనుకబడిన వారికి ప్రత్యేక నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు 13 రకాల స్కీములు అమలు జరగడం లేదన్నారు. పివిటిజిలకు అంత్యోదయ పథకం కింద ఇస్తున్న 25 కిలోల బియ్యాన్ని రద్దు చేయడం అన్యాయమన్నారు. ప్రపంచంలోనే ఆర్గానిక్ కాఫీగా బ్రాండ్ సంపాదించిన అరకు కాఫీకి గిట్టుబాటు ధర కరువైందన్నారు. ఏజెన్సీలో 45 గ్రామాల్లో రోడ్డు వేయకుండా అటవీశాఖ అడ్డుపడుతోందని, గిరిజనులకు ఉపయోగపడని హైవే రోడ్డుకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతగిరి, చింతపల్లి ప్రాంతంలో నిర్మించనున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు వల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. టిడిపి, వైసిపి, జనసేనవి ఒకే విధానాలన్నారు. బిజెపి మద్దతుతోనే చంద్రబాబు జైలుకు వెళ్లిన విషయం అందరికీ తెలుసునని, జైలు నుంచి బయటికి వచ్చిన తరువాత ఆయన బిజెపికి ధన్యవాదాలు తెలియజేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలుగు ప్రజల పౌరుషాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టవద్దని హితవు పలికారు.

పరిష్కారంకాని గిరిజన సమస్యలు : సురేంద్ర

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఏ ఒక్క గిరిజన సమస్యా పరిష్కారం కాలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర అన్నారు. గిరిజన చట్టాలు ఎలా నిర్వీర్యం అవుతున్నాయో తెలిపారు. ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాన్ని పోరాటాలతో అడ్డుకున్న ఘనత సిపిఎంకే దక్కుతుందన్నారు. కొల్లాపూర్ భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఏజెన్సీని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

కరువుపై సరిగా స్పందించని ప్రభుత్వం : ఎం.సూర్యనారాయణ

రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ విభజన హామీలు ఏ ఒక్కటీ రాష్ట్రంలో అమలు కాలేదన్నారు. కరువుపై పాలకుల స్పందన సరిగా లేదన్నారు. నీటి వనరులను సక్రమంగా అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రరూపం దాలుస్తున్నాయన్నారు.

వైసిపిది సాధికారిత యాత్ర కాదు.. రాజకీయ యాత్ర : అప్పలనర్స

రాష్ట్రంలో వైసిపి నాయకులు సాధికారిత యాత్ర పేరుతో చేస్తున్నది రాజకీయ యాత్ర అని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. యాత్రల పేరుతో ఓట్లను దండుకొనే ప్రయత్నం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని తెలియజెప్పారు. జనసేన, టిడిపి, వైసిపిలు ఒకరినొకరు విమర్శించుకుంటూ తిట్టుకోవడానికి తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడటం లేదన్నారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.సుబ్బారావు, ఎ.అశోక్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హైమావతి తదితరులు మాట్లాడారు.

సిపిఎం నాయకులు, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు, కె.రామారావు, పోతురాజు, సూర్యారావు, సుంకరమెట్ట సర్పంచ్ గేమ్మిలి చిన్నబాబు, గసభ మాజీ సర్పంచ్ సురేష్, ప్రస్తుత సర్పంచి సునీత, సూరి, మగ్గన్న, హరి, గురుమూర్తి, మొద్దు, జోషి, పి.సత్యనారాయణ, టి.సూర్యనారాయణ, లక్ష్మణ్, గాసిరాం దొర, జర్రెల ఉప సర్పంచ్ గణపతి, ఎంఎం.శ్రీను, కొర్రా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన గిరిజనులు

జిసిసి సీనియర్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు చర్యలు

- జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

వచ్చే సీజన్లో జిసిసి ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిసిసి డివిజనల్ మేనేజర్ వారి కార్యాలయంలో డివిజన్లోని జిసిసి సీనియర్ మేనేజర్లతో కార్యాలయ సిబ్బందితో మేనేజింగ్ డైరెక్టర్ అడవి ఉత్పత్తులు కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సీజన్లో వివిధ రకాలైన అడవి ఉత్పత్తులు కొనుగోలు చేసి జిసిసిని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రతి నెల రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. డివిజనల్ మేనేజర్ కార్యాలయానికి మరమ్మతులు చేయించి ఆ భవనం ఉపయోగించుకునే విధంగా ప్రతిపాదన సమర్పించాలని డివిజనల్ మేనేజర్‌ను ఆయన ఆదేశించారు. అనంతరం జిసిసి బంకును సందర్శించి పరిశీలించారు. బంకులో పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గ్యాస్ గొడౌన్ ఏ విధంగా నిర్వహిస్తున్నదీ పరిశీలించారు. ఈ సమావేశంలో జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, సీనియర్ మేనేజర్లు ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, కె.చంద్రశేఖర్, యం.విజయలక్ష్మి. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లినిక్‌లో తనిఖీలు చేస్తున్న ఎడిఎంహెచ్‌ఒ పుల్లయ్య, తహశీల్దారు సుబ్బారావు తదితరులు

ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ల సీజ్

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు డివిజన్‌లోని ఆర్‌ఎంపిలు నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లను జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుల్లయ్య గురువారం సీజ్ చేశారు. చింతూరు, ఎర్రంపేట గ్రామాల్లో ఉన్న ఆర్‌ఎంపి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లను డాక్టర్ పుల్లయ్య, మండల తహశీల్దార్ కె.సుబ్బారావు అకస్మాత్‌గా తనిఖీ చేశారు. అనధికారికంగా అర్హతకు మించి రోగులకు చికిత్స నిమిత్తం ఉపయోగించిన యాంటీ బయాటిక్స్ ఇంజక్షన్లు, అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నా బెడ్స్, సెలైన్ బాటిల్స్‌ను మూసివేశారు. ఇలా సీజ్ చేసిన క్లినిక్‌ల్లో దివ్యజ్యోతి క్లీనిక్, ప్రజా వైద్యశాల, ఎమ్‌డి మహబూబ్ క్లీనిక్, హన్సిక ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్, ఎమ్‌డి జక్రియా క్లీనిక్, శ్వేతశ్రీ క్లీనిక్, అక్షయ మెడికల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ తదితర ఏటు క్లిన్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ కె.చైతన్య, మాట్లాడుతూ ఇకపై తమ అర్హతకు మించి తెలిసీ తెలియని వైద్యంతో ఏజెన్సీ ప్రజలకు అధిక మోతాదులో ఇంజక్షన్స్ వాడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారిపై పై చట్టపరంగా తగు చర్యలు తీసుకోబడునని తెలియజేశారు. అందుబాటులో ఉన్న ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు సేవలు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లు, 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాదికారుల సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతూరు వైద్య, రెవెన్యూ సిబ్బంది జరిగినది.

ఉమామహేశ్వరరావుకు విఎస్‌ఆర్ పరామర్శ

ప్రజాశక్తి- విశాఖపట్నం

శస్త్ర చికిత్స చేయించుకొని విశాఖపట్నం కూర్మన్నపాలెంలో విశ్రాంతి తీసుకుంటున్న సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు బుధవారం రాత్రి పరామర్శించారు. ఉమామహేశ్వరరావు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ఉన్నారు.

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-రంపచోడవరం

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు సంబంధించిన గ్రామాలకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎండి యూసఫ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

అక్టోబర్ రేషన్ బియ్యం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కూటూరు రేషన్ షాప్ పరిధిలో అక్టోబర్ నెల రేషన్ బియ్యం ఇవ్వలేదని, తక్షణమే ఆ బియ్యం ఇవ్వాలని కోరుతూ సచివాలయం ముందు బాధితులు గురువారం ధర్నా చేసారు గ్రామస్తులు. తమకు రేషన్ బియ్యాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం లబ్ధిదారులు స్థానిక విఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. దీనిపై జిసిసి మేనేజర్‌ని విఆర్‌ఓని వివరణ కోరగా రావాల్సిన బియ్యం రేషన్ కార్డు ప్రకారం ఎంఎల్ పాయింట్ దగ్గర నుండి రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమం లో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం వినతిపత్రం ఇస్తున్న బాధితులు

జ్వరంతో బాధపడుతున్న మహిళ

విష జ్వరాలతో విలవిల

- నందిగరువు, ఓనూరు గ్రామాల్లో మంచం పట్టిన గిరిజనులు

-వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి : ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని వంట్లమామిడి పంచాయతీ పరిధిలోని ఓనూరు, నంది గరువు గ్రామాలలో పలువురు గిరిజనులు విష జ్వరాలతో విలవిలలాడుతున్నారు. ఈ గ్రామాల్లో జ్వరాలు ప్రబలడంతో ప్రతి ఇంటింటా గిరిజనులు అస్వస్థతతో బాధపడుతున్నారు. ఈ గ్రామాల్లో గురువారం ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు, మాజీ సర్పంచ్ పాలికి లక్కు సందర్శించి జ్వరాలతో అనారోగ్యానికి గురైన గిరిజనులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ, సుమారు 15 మంది వరకు విష జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. వేడి. జ్వరం, ఒళ్లంతా మంటలు, కాళ్ల చేతులు పీకుడు వంటి అనారోగ్య సమస్యలతో పలువురు వృద్ధులు, చిన్నారులు, మహిళలు జ్వరాల భారిన పడి అస్వస్థతకు లోనయ్యారని తెలిపారు. తక్షణమే ఆ ప్రాంతంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి వాళ్లకు తగిన వైద్యం అందించవలసిందిగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కోరారు . ఈ గ్రామాల్లో ప్రస్తుతం కొర్ర రుప్పి (40), పాంగి చంటి (25), జమ్మిలి బాబురావు (26), కుర్ర మహేష్ (27) పాంగి సావిత్రి (29), పాంగి దశై (29), పాంగి దేవి (14),కొర్ర లచ్చి (50), కుర్ర అమ్ములు (6), మామిడి శ్రీవాణి (15), గేమ్మెలి ఎరుకన్న (32) కుర్ర లక్ష్మి (33) జ్వరాలతో ఉన్నారని తెలిపారు. కొర్ర రూపా (55) వృద్ధుడు కుడికాలు కుడి చేతి పడిపోవడంతో పక్షవాతంతో తీవ్ర అస్వస్థతకు గురై ఇబ్బంది పడుతున్నాడని తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక శిబిరాలు : జెసి

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 4, 5 తేదీలలో ఓటరు జాబితా సవరణకు సంబంధించి ప్రత్యేక శిభిరాలు నిర్వహిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ జే. శివశ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఫోటో ఓటర్ల జాభితా తయారీ, పేరుల చేర్పు. పేరును తొలగించడం, ఒక ఊరునుండి వేరొక ఊరుకు మారడం వంటి వాటిపై పోలింగ్ కేంద్రాలు, లేదా బూత్ స్థాయి అధికారులకు అభ్యంతరాలను సమర్పించాలన్నారు. ఈ ప్రత్యేక శిభిరములలో కూడా ప్రత్యేక క్లైములు స్వీకరిస్తామని జేసి తెలిపారు.

ప్రత్యేక ఉప కలెక్టర్‌గా మురళీకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఉన్న కోనేరు రంగారావు రిఫార్మ్స్ కమిటీ ప్రత్యేక ఉప కలెక్టం గా పంచరెడ్డి మురళీకృష్ణ గురువారం భాద్యతలు స్వీకరించారు. ముందుగా స్థానిక శ్రీ మొదకొండమ్మ అమ్మవారిని దర్శనం చేసుకున్న మురళీకృష్ణ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిశారు. మురళీకృష్ణ రాష్ట్ర సచివాలయంలో సహాయ సెక్షన్ అధికారిగా, సెక్షన్ అధికారిగా, శ్రీకాకుళం, పోలాకి, భామిని, మండ లాలలో తహసిల్దార్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కెఆర్‌ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బదిలీ పై వచ్చారు.

అంగన్వాడీ ఆయా నియామకంలో

అక్రమాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని గూడూరు అంగన్వాడీ ఆయా-1 నియామకంలో అక్రమాలు జరిగాయని, సమగ్ర విచారణ జరిపించి అర్హత పరీక్షల్లో మెరిట్ ఆధారంగా నియమకం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రం శెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గూడూరులో అర్హతల పరీక్షల్లో మెరిట్ సాధించినటువంటి పోటీదారులతో సిపిఎం నాయకులు పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు గూడూరు అంగన్వాడి ఆయా-1 నియమకంలో అర్హతలు ఉన్న వారికి కాకుండా రాజకీయ పలుకుబడి, ఒత్తిడి మేరకు నియామకం జరిగినట్లుగా తెలిపారు. 2023 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ప్రకటన చేసి మార్చిలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఇతర సెంటర్లకు నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. గూడూరు సెంటర్‌ను మాత్రమే నియమకాన్ని నిలుపుదల చేశారని స్థానికంగా ఉన్న కొంతమంది రాజకీయ పలుకుబడితో ప్రజాప్రతినిధుల అండదండలతో ఆయా నియమకాన్ని తమ అనుకూల మైన వారికి ఇప్పించుట కోసం ఈ విధంగా అధికారులు కూడా సహకరించారని విమర్శించారు. నోటిఫికేషన్‌లో వచ్చిన సెంటర్లకు అన్నింటిని భర్తీ చేసి, గూడూరు సెంటర్‌ను మాత్రం ప్రత్యేకించి జరగటం ఎందుకని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ అనుకూల మైనటువంటి అభ్యర్థులను పెట్టడం కోసమే సెలెక్షన్ చేసిన వారిపై ఒత్తిడి తీసుకొచ్చినట్లుగా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అర్హతలు సాధించిన వారి ఫలితాలను బహిర్గతం చేసి న్యాయబద్ధంగా నియమకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పోడియం లక్ష్మణ్ మొట్టం రాజయ్య,, గూడూరు గ్రామస్తులు సోడా వినీత, ధూళి లక్ష్మయ్య, మడక నాగేశ్వరరావు, తెల్లం, జయ, పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

చంద్రబాబుపై రాజకీయ కక్ష సాధింపు సరికాదు

ప్రజాశక్తి-కొయ్యూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ అన్నారు. మండలంలోని రేవళ్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు న్యాయం గెలిచింది పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబుకు బెయిల్ మంజూరయ్యే అవకాశం ఉందని తెలిసి మరో అక్రమం కేసు సిద్ధం చేశారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, టిడిపి నాయకులు. మట్టపర్తి అప్పలరాజు, స్వామి, బి అప్పన్న, జి చిన్ని, ఎం సత్తిబాబు, చిన్ని, రమణ, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

పకడ్బందీగా సంక్షేమ పథకాలు అమలు

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి రంపచోడవరం : వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుందని ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలో భీరంపల్లి సచివాలయంలో భీరంపల్లి, పెనికలపాడు గ్రామాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామలలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ నాలుగు సంవత్సరాలు కాలంలో వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత వచ్చిందో కూడా తెలియజేశారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏవీ?

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణంలో ఇంజనీరింగ్ అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని స్థానిక పోతంగి పంచాయతీ ఎంపిటిసి ఎం.గీత ఆరోపించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనాన్ని, సబ్ హెచ్‌సి భవనాన్ని గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీ ప్రజలకు దగ్గరలో మంచి సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం లక్షలాది రూపాయలను నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో భవన నిర్మాణాలు నాసిరకంగా జరుగుతున్నాయని ఆరోపించారు. సబ్ హెచ్‌సి భవనం నిర్మించి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటికీ ప్రారంభించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకుడు ఎం సింహాద్రి పాల్గొన్నారు.

నేడు అనంతగిరిలో స్పందన

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల మూడవ తేదీ శుక్రవారం అనంతగిరిలో జగనన్నకు చెబుదాం (ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన అనంతరం శాఖాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతగిరిలో స్పందన ఉన్నందున పాడేరులో స్పందన రద్దు చేయడం జరిగిందని, ప్రజలు గమనించి పాడేరుకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రవ్వలగూడ పాఠశాల ల్యాబ్ ను పరిశీలిస్తున్న రమణ

పాఠశాలల్లో ల్యాబ్‌ల పరిశీలన

ప్రజాశక్తి - అరకులోయ: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన జనరల్ సైన్స్ ల్యాబ్, స్టెమ్ లేబ్స్‌ను ఏటిఎల్ టాస్క్ ఫోర్స్ అధికారి ఆర్.వి.రమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అరకులోయ మండలంలోని రవ్వలగూడ జెడిబెడ్ల్యు ఏఎస్ బాలుర పాఠశాలలోని ల్యాబ్‌ను తనిఖీ చేసిన అనంతరం పాఠశాలలోని అన్ని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు ఉపాధ్యాయులు బోధించాలని ఆయన సూచించారు. కంఠబంసుగూడ లోని సిహెచ్ స్కూల్, కొత్తబల్లుగూడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ టి.నాగేశ్వరరావు, రవ్వలగూడ హెచ్‌ఎం హెచ్.వి. కెండ, సిహెచ్ స్కూల్ హెచ్‌ఎం ఎల్.బి.దయానిధి, కొత్తబల్లు గూడ హెచ్‌ఎం టి.పద్మ, ల్యాబ్ ఇన్చార్జి సింహాద్రి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐసిఐడి కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : జల సంరక్షణ పై 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ (ఐసిఐడి) సమావేశాలు విశాఖ బీచ్ రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జరిగే వీటిలో పలు దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. తొలి రోజు సదస్సును కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ వ్యవసాయ రంగం నీటి కొరతతో కరువు పరిస్థితులు చవిచూస్తోందని, దీన్ని అధిగమించేలా సరైన నీటి పారుదల నిర్వహణ విధానం ఎంతైనా అవసరమౌందని చెప్పారు. ఎపిలో 40 ప్రధాన మధ్యతరహా, చిన్న నదులున్నాయని, వ్యవసాయం, నీటిపారుదల రంగాల్లో శతాబ్దాలుగా రాష్ట్రం గొప్ప వారసత్వాన్ని కలిగి ఉందని తెలియజేశారు. నేటి పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టూ కీలకంగా మారిందన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ దేశం ఇరిగేషన్‌లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. నీటి రంగంలో సమగ్ర విధానంతో కేంద్రం ఉందన్నారు. ఈ కాంగ్రెస్‌లో ఐసిఐడి అధ్యక్షులు డాక్టర్ రగాబ్ పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాలను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి గురువారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఓ ఓలతో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవనాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవినీతికి పాల్పడితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన నిర్మాణాలపై ఇంజనీరింగ్ అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను సంబంధిత శాఖలకు అప్పగించాలని ఆదేశించారు. పూర్తి చేసిన పనులకు బిల్లులు వారం రోజుల్లో చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదని, జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు నిధుల కొరత లేదన్నారు. భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడానికి ఎంపిడిఓలు చొరవ చూపించాలని చెప్పారు. ఈనెలాఖరు నాటికి 11 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 60 గ్రామ సచివాలయం భవనాలు, 51 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. అడ్డతీగల, దేవీపట్నం, వై.రామవరం, జి.కె. వీధి, కొయ్యూరు, రంపచోడవరం, రాజవొమ్మంగి, పాడేరు మండలాలలో పనులు చురుగ్గా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. జి.కె. వీధి మండలం ధారకొండ, దుప్పిలవాడ, లక్ష్మిపేట, రింతాడ 1,2, ఏడు భవనాలు తుది దశకు చేరుకున్నాయని ఎంపిడిఓ పర్యవేక్షించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.గంగవరం మండలంలోని పిడత మామిడి, కొత్తాడ, గంగవరం రైతు భరోసా కేంద్రాలలో పనులు ఈనెల 5 వతేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ముంచింగిపుట్ మండలంలో ఏడు రైతు భరోసా కేంద్రాల భవనాలను పూర్తి చేసి ఈనెలలోనే అప్పగించాలని సూచించారు. దేవీ పట్నం మండలంలో వి.రాముద్రపాలెం హెల్త్ క్లినిక్, చిన రమణయ్యపేట గ్రామ సచివాలయం భవనం ఈవారంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, రంపచోడవరం పిఓ సూరజ్ గనోరే, పిఆర్ ఇఇ కె.లావణ్య కుమార్, పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలను నియంత్రించాలి

జిల్లాలో మాతృ మరణాల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గత ఏప్రిల్ నెల నుండి ఇంత వరకు జరిగిన ఎనిమిది మాతృ మరణాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా మరణాలు జరగడానికి కారణాలపై సంబంధిత సిబ్బందిని ఆరా తీశారు. మాతృ మరణాలు సంభవించకుండా ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులపై దృష్టి సారించాలని, నిరంతరం ట్రాక్ చేయాలని, ముందుగానే బర్త్ వెయిటింగ్ హాల్స్ కు తరలించాలని సూచించారు. ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు ప్రతి రెండు రోజులకు ఒకసారి గర్భిణులను సందర్శించి తగు సూచనలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాలలో సమావేశాలు నిర్వహించి ఆసుపత్రి ప్రసవాలలో లాభాలు, గృహ ప్రసవాల నష్టాలను చర్చించి వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. బిపి, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి బరువును పర్యవేక్షించాలన్నారు.వివరం లేదని చెప్పి తప్పించుకునే సహించేది లేదని, వారికి అర్ధ అయ్యేలా హితబోధ చేయాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ నియంత్రణను ప్రోత్స హించాలని, హెల్త్ ఎడ్యుకేషన్ పెంపొందించాలని సూచించారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ, బర్త్ వెయిటింగ్ హాలుకు రాడానికి నిరాకరించిన గర్భిణీలు, కుటుంబ సభ్యులను గ్రామ ప్రజాప్రతినిధులు, మహిళా పోలీసుల సహాయంతో తరలించడానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, డిసిహెచ్ఎస్ కృష్ణ రావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి, ప్రవంచ ఆరోగ్య సంస్థ రాష్ట్ర సర్వెలెన్స్ మెడికల్ అధికారి ఝాషువ, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ధాన్యం, రాగి కొనుగోలు కేంద్రాలు

జెసి శివ శ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ప్రాథమికంగా 46 ధాన్యం, 24 రాగి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందని సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు స్పష్టం చేసారు. గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో జెసి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలలో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను, నియమించాలన్నారు. రైతులకు కావలసిన గోనేసంచులు, ధాన్యం రావాణాకు వాహనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లుకు రవాణా చేసే వాహనాలు ఖచ్చితంగా జిపిఎస్‌తో అనుసంధానించాలన్నారు.
ప్రభుత్వం ధాన్యం, రాగులు కొనుగోలుకు మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. ధాన్యం మద్దతు ధరను సాధారణ రకానికి క్వింటా రూ.2,183, గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2,203 గాను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అదేవిధంగా రాగులుకు మద్దతు ధర క్వింటా రూ.3,846లుగా ప్రకటించడం జరిగిందన్నారు. రైతులు తమ రాగులను శుభ్రపరచుకొని నాణ్యత ప్రమాణాలకు లోబడి ప్రభుత్వం ప్రారంభించే కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని జెసి సూచించారు. ఈ క్రాప్‌లో పంట వివరములు నమోదు చేయించుకోవాలని సూచించారు. ధాన్యం , రాగులు అమ్మే సమయంలో ఎటువంటి ఇబ్బంది ఎదురైనా టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేయాలని తెలిపారు. జిల్లాలో ప్యాడి కంట్రోల్ రూమ్ నెంబర్ 7569393686 ఏర్పాటు చేసినట్లు జెసి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నందు, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్యామ్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజరు గణేష్ కుమార్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఎం.వి రామకృష్ణం రాజు, చింతపల్లి వ్యవసాయ ఏడి వ్యవసాయ అధికారులు, వాసన్, సుసాగు ఎఫ్ పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి శివ శ్రీనివాసు

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

రోడ్డు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని గేమ్మేలి సచివాలయ పరిధి గొడుగురాయి గ్రామంలో నిలిపి వేసిన రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్ డిమాండ్ చేశారు. గురువారం గొడుగురాయి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో చాలాకాలం ఉద్యమం చేసినతర్వాత గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుండి 49 లక్షలతో గ్రావెల్ రోడ్డు మంజూరు అయ్యిందని,ఫారెస్ట్ శాఖ అధికారులు అడ్డుపడుతుండటంతో పనులు నిలిపి వేశారన్నారు. స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ప్రారంభించలేదన్నారు. ఎవరికైనా ఆరోగ్యం బాగో లేకపోతే అంబులెన్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ నెల 3న సిపిఎం ప్రజా రక్షణ బేరి బస్సు యాత్ర జి.మాడుగులకు చేరుకుంటుందని, బృందానికి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్, మండల కార్యదర్శి వనుగు సన్యాసిదొరచ పంచాయతీ నాయకులు వంజరి పినంనాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

టోకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచ్ కె .మొస్య ఆధ్వర్యాన స్థానిక సచివాలయం భవనం వద్ద నిర్వహించారు. ఎంపిపీ శెట్టి. నీలవేణి రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తు న్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సర్పంచ్ దొన్ను, ఎంపీడీవో అర్జిత్ రాజ్యం, ఆర్ఐ శంకర్రావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ .మదీనా, సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవులకు టీకాలు

ప్రజాశక్తి -అనంతగిరి: లుంగపర్తి పంచాయతీ పరిధి మెట్టవలస, వెలగలపాడు, ఎర్రమెట్టు, గ్రామాల్లో పశువులు, మేకలకు టీకాలు వేయడం జరిగిందని పశు వైద్యాధికారి సందీప్ తెలిపారు. తొలి దశలో టీకాలు వేసినప్పటికీ పశువులు, మేకలకు వ్యాధి లక్షణాలు వ్యాపించడంతో లక్షణాలతో బాధపడుతున్న మూగజీవులకు టీకాలు వేయడం జరిగిందని ఆయన తెలిపారు

943వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను విరమించాలని డిమాండ్ చేస్తూ కార్మిక ప్రజా సంఘాల జెఏసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 943వ రోజుకు చేరాయి. దీక్షల్లో కెవిపి చంద్రమౌళి, కె.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు హఠాన్మరణంపై సంతాపం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దామనాపల్లి పంచాయతీ జిసిసి డిపో సేల్స్‌మెన్ లక్ష్మణరావు హఠాన్మరణం చెందడం పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశ్వేశ్వరరాజు గురువారం లక్ష్మణరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఓదార్చారు. లక్ష్మణరావు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని విశ్వేశ్వరరాజు చెప్పారు. సర్పంచ్ కుందేటి రామకృష్ణ, వైసిపి నాయకులు లక్ష్మణరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

లక్ష్మణరావు పార్థిక దేహానికి నివాళులర్పిస్తున్న విశ్వేశ్వర రాజు

నెరెడ్కో ప్రాపర్టీ షోను విజయవంతం చేయాలి

- వచ్చేనెల 1,2,3 తేదీల్లో నిర్వహణ

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎంపి ఎంవివి

ప్రజాశక్తి -మధురవాడ : నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఉత్తరాంధ్ర, విశాఖపట్నం శాఖల ఆధ్వర్యంలో వచ్చేనెల 1,2,3 తేదీల్లో విశాఖపట్నం మధురవాడ వైజాగ్ కన్వెన్షన్‌లో ప్రాపర్టీ షోను విజయవంతం చేయాలని నెరెడ్కో జాతీయ అధ్యక్షులు హరిబాబు కోరారు. గురువారం స్థానిక వి కన్వెన్షన్‌లో నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విశాఖ ఎంపీ ఎంవివి. సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరి సొంతింటి కలను సాకారం చేయాలన్నదే నెరెడ్కో లక్ష్యమన్నారు. మహానగరంగా రూపుదిద్దుకుంటున్న విశాఖపట్నం అన్ని రకాలుగా కొత్త తరహా నివాసానికి సిద్ధంగా ఉందన్నారు. దీనిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

నెరెడ్కో ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ,.25 వసంతాలు పూర్తి చేసుకుని, రజతోత్సవం జరుపుకుంటున్న నెరెడ్కో మౌలిక సదుపాయాల రూపకల్పనకు అండగా ఉంటుందన్నారు. వచ్చేనెలలో జరగబోయే ప్రాపర్టీషో విభిన్న రకాల ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు, హాలీడే హోమ్‌ల వివరాలను కొనుగోలుదారులకు అందించనుందన్నారు.

(ాపర్టీ షో కన్వీనర్ విద్యాసాగర్, రమేష్‌బాబు, మండవ సతీష్ మాట్లాడుతూ,ప్రాపర్టీ ఎక్స్‌పోలో రియల్ ఎస్టేట్ కంపెనీలు, బిల్డర్స్‌తో పాటూ బ్యాంకర్స్, ఇంటిరియర్ డిజైనర్స్, గృహోపకరణాలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ వెరశి వన్‌స్టాప్ ప్రాపర్టీ అండ్ ఇంటిరియర్ ఎక్సపోగా ఉండబోతుందన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం , విజయనగరం మరియు ఉత్తరాంధ్ర నెరెడ్కో శాఖల ప్రతినిధులు వెంకన్న చౌదరి, దండమూడి పాపారావు, సుబ్బారావు,వరదా సునీల్ నాగకుమార్,బైరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

సిఐటియు పోరాట ఫలితం

- హెల్త్ అలవెన్స్ బకాయి విడుదలపై హర్షం

ప్రజాశక్తి- మాధవధార : సిఐటియు పోరాటాల వల్ల జివిఎంసి పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలను విడుదలయ్యాయని, ఇది సిఐటియు పోరాటాల ఫలితమేనని యూనియన్ కంచరపాలెం జోన్ నాయకులు శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం 51వవార్డు కళింగనగర్‌లో పారిశుధ్య కార్మికులతో విజయోత్సవ సభ నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల హెల్త్ అలవెన్స్ బకాయి విడుదల చేసినప్పటికీ, మరో మూడు నెలల బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. తక్షణమే పారిశుధ్య కార్మికుల ఖాతాల్లో వాటిని జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి. పాపయ్య, ఎన్.వీరభద్రుడు, ఎస్.పోలయ్య, హెచ్.దేవి, కనకమహాలక్ష్మి, బి.లక్ష్మి, ఎస్.దాలయ్య, ఆర్.అప్పలరాము, పి.సూర్యకాంతం ఇ.వెంకన్న పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని అన్ని గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. స్థానిక మార్తా శ్రీరామ్మూర్తి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన 2012లో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు వేసిన రోడ్లు పాడై పోయి దారుణంగా ఉన్నాయని తెలిపారు. కొన్ని గ్రామాల్లోకి నేటికీ మట్టి రోడ్లే ఉన్నాయని, సీసీ రోడ్లు లేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

పాలకులు మారుతున్నా గ్రామాల్లో అభివృద్ధి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సర్పంచ్ నాగమణి, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత సీతారామయ్య

గిరిజన రైతులను తక్షణమే ఆదుకోవాలి

కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన నాయకులు కార్యకర్తలు

ప్రజాశక్తి -సీలేరు : ఈ ఏడాది వర్షాలు సకాలంలో లేకపోవడంతో గిరిజన రైతుల తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం గొర్రిలోవలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో సుబ్బారావు మట్లాడుతూ ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గిరిజన రైతులు పంటలు పండగ తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. పేదలకు న్యాయం జరగాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని, అందుకు కేంద్రం రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలన్నారు. ఈ సమావేశంలో డిసిసి మాజీ అధ్యక్షులు ఎం.బాలరాజు, కాంగ్రెస్ నాయకులు కంకిపాటి వీరన్నపడాల్, చౌడుపల్లి మాజీ సర్పంచ్ సాగిన కృష్ణపడం, లాకే రమణ, గోపీనాథ్, కొర మోహన్‌రావు, మాజీ సర్పంచ్ అలంక రాజు, మాజీ ఉపసర్పంచ్ కారే శ్రీనివాసరావు, మల్లుదొర, రాంబాబు, దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు, సీలేరు పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తహశీల్దారును కలిసిన 'అల్లూరి' సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని కాకరపాడు సెంటర్లో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘానికి మూడు సెంట్లు స్థలం కేటాయింపు విషయంపై ఆ సంఘం నాయకులు గురువారం తహశీల్దారు సిహెచ్.తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. అల్లూరి సంఘానికి మూడు సెంట్లు స్థలం కేటాయింపుపై వివరాలు పంపించాలని కలెక్టర్ నుండి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో అల్లూరి సంఘం కార్యదర్శి శ్యామలా వరలక్ష్మి, కార్యవర్గ సభ్యుడు కోన సత్యనారాయణ తదితరులు తహశీల్దార్‌తో చర్చించారు.

ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ స్థలానికి సంబంధించిన రిపోర్టును తొలుత సబ్ కలెక్టర్‌కు పంపించగా, ఆయన దగ్గర నుండి కలెక్టర్ దగ్గరకు వెళ్ళగా కలెక్టర్ వివరణకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. స్థలం మంజూరుకు సిఫార్సు చేసి సహకరిస్తున్నందుకు తహశీల్దార్ తిరుమలరావుకు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

తహశీల్దారుతో మాట్లాడుతున్న 'అల్లూరి' సంఘం ప్రతినిధులు

వైసిపి సర్కారుకు అంతిమ ఘడియలు

ప్రజాశక్తి- పెందుర్తి : జనసేన, తెలుగుదేశం కూటమి కలయికతో వచ్చే ఎన్నికలలో ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తున్న వైసిపి, జగన్మోహనరెడ్డి సర్కారుకు అంతిమ ఘడియలు వచ్చి, గద్దె దిగక తప్పదని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ అన్నారు. గురువారం పెందుర్తిలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివశంకర్ జన్మదినం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిఎం జగన్‌కు ఎక్కడికెళ్లినా ఇబ్బందులు ఉన్నాయని, అందుకే ప్రశ్నించేవారిని నిర్బంధించి పర్యటనలు చేస్తున్నారన్నారు. గురువారం సిఎం విశాఖ పర్యటనకు వచ్చిన సందర్భంలో తనను పోలీసులు గృహ నిర్బంధం చేశారన్నారు. జగన్‌కు భజన చేసిన వారికి మాత్రమే భావప్రకటనాస్వేచ్ఛ ఉందన్నారు. టిడిపి, జనసేన హిట్ కాంబినేషన్‌తో జగన్‌పాలనకు అంతిమ ఘడియలు వచ్చాయన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు డిటిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దుమంతి సత్యనారాయణకు రీసర్వేకు సంబంధించి డిప్యూటీ తహశీల్దార్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనను జీకే వీధి మండలానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొయ్యూరులో రీసర్వే పనులు జరుగుతుండడంతో, కొంతకాలం కొయ్యూరులోనే ఉండి విధులు నిర్వహించనున్నట్టు సత్యనారాయణ తెలిపారు.

సత్యనారాయణ

ప్లాస్టిక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలి

పరిశ్రమల యజమానులకు ఆ శాఖ జెడి గణపతి సూచన

ప్రజాశక్తి -గాజువాక : వచ్చేనెల 7 నుంచి 11వరకు ముంబయిలో నిర్వహించే ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఎగ్జిబిషన్ అండ్ కాన్ఫరెన్స్‌లో ఆటోనగర్‌లోని పరిశ్రమల యజమానులంతా పాల్గొని విజయవంతం చేయాలని పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.గణపతి పిలుపునిచ్చారు. గురువారం గాజువాకలో దీనికి సంబంధించి ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ, ఎగ్జిబిషన్‌లో ప్లాస్టిక్‌కు సంబంధించి అధునాతన, తాజా పరిజ్ఞానానికి సంబంధించినవి ప్రదర్శిస్తారని, వాటిపై అవగాహన కోసమైనా ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధమని, అయితే ఇతరత్రా అన్ని విషయాల్లో రీసైక్లింగ్ ప్లాస్టిక్ అవసరం ఉందన్నారు.. వాసవ అధ్యక్షులు పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో రీసైక్లింగ్ ప్లాస్టిక్‌కు మంచిరోజులు రాబోతున్నాయని, మన దేశం ఏటా రూ.35వేల కోట్ల విలువైన ప్లాస్టిక్ ఉత్పత్తులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. ఐలా చైర్మన్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, చైనా మాదిరిగా ప్లాస్టిక్ పరిశ్రమలన్నీ ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఇ డైరెక్టర్ చంద్రమౌళి, గాజువాక ఆటోనగర్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖలో నాటకోత్సవాల సందడి

- జనవరి 4 -7 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ

ప్రజాశక్తి - సీతమ్మధార: వచ్చే ఏడాది జనవరి 4, 5, 6, 7 తేదీల్లో విశాఖలో రాష్ట్రస్థాయి కథా నాటిక పోటీలు జరగనున్నాయని మాజీ మంత్రి, రచయిత, సాహిత్య ప్రయోక్త దాడి వీరభద్రరావు వెల్లడించారు. ఇది కళాభిమానులకు, సాహితీవేత్తలకు ఉత్సవాల విందు కానుందన్నారు. గురువారం పౌరగ్రంథాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అజో విభో కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన 31వ వార్షిక సభల విశిష్ట పురస్కారాల వివరాలను వెల్లడించారు.

విశాఖలో 30ఏళ్లుగా ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న సాహిత్య నాటిక ఉత్సవాల్లో భాగంగా నాలుగు రోజులు పాటు నిర్వహించే వేడుకల్లో ఉదయం సాహిత్య గోష్టి, సాయంత్రం నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ జిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని, నాటకాలను ప్రేక్షకులకు చూపించడం తమ లక్ష్యమన్నారు. సాహిత్యంలో అత్యంత ప్రతిభ చూపిన వారికి రూ.లక్ష నగదుతో పాటు పురస్కారాలను అందజేస్తామన్నారు. నాటికలకు ప్రచురణకర్తలు కరువైన పరిస్థితుల్లో తమ ఫౌండేషన్ ద్వారా అనేక ప్రచురణలు వెలుగులోకి తెచ్చామన్నారు.

అజో విభో కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ, నాటకోత్సవాల ప్రారంభం రోజున నాటక పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ సాహిత్యంలో నిష్ణాతులకు సడన్ మనీ ప్రైజ్ కింద ఐదుగురికి రూ.10 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఈ పోటీలకు, ఇంకా ప్రచురణ కాని 36 నాటికలు పరిశీలనకు వచ్చాయని, వీటిలోని 8,9 నాటికలు ప్రదర్శిస్తారన్నారు. కళా, సాహిత్య అభిమానులు, నగర ప్రజలు ఈ ఉత్సవాలో పాల్గొని నాటకోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బాదంగిరి సాయి పాల్గొన్నారు.